అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మియాపూర్: భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోషించిన పాత్ర ఎన్నిటికీ మరవలేనిదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ అన్నారు. మియాపూర్‌లోని ఓంకార్‌నగర్ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. అంబేడ్కర్ విశ్రాంత కృషి ఫలితంగానే రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కును గుర్తు చేశారు. యువత అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులున్నారు.

అరుణజ్యోతికి దళితరత్న అవార్డు

మణికొండ: దళితజ్యోతి అభ్యున్నతికి, వారిలో స్ఫూర్తి నింపే పనులను చేసిన వారికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ తరఫున ఇచ్చే దళితరత్న అవార్డును నార్సింగి మాజీ వార్డు సభ్యురాలు పత్తి అరుణజ్యోతికి దక్కింది. నార్సింగిలో అంబేడ్కర్ భవనం ముందు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, గ్రామంలోని దళితుల అభివృద్ధికి కృషి చేయటంతో ఆమెకు అవార్డు దక్కింది. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ఆమెకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను నార్సింగి వాసులు పెద్ద ఎత్తున అభినందించారు.

వైభవంగా మండల పూజ


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం 51వ రోజు మండల పూజా కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ గణపతి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి శివ పంచాయతీని ద్వాదశ జ్యోతిర్లింగం సంతోషిమాత విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేసి 501 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు దేవతామూర్తుల అభిషేకాలు, అలంకరణ అనంతరం హారతి, 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాంగ ప్రాసన, నవగ్రహ ఆరాధన, 9 గంటలకు గణపతి హోమం, నవగ్రహం హోమం, రుద్ర హోమం, చండీ హోమం, బలి ప్రదానం, పూర్ణాహుతి, శివ పార్వతుల కల్యాణం, ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు.

ఓపెన్ యూనివర్సిటీలో గోరటి వెంకన్న పాట

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన 'సామాజిక సాధికారత' వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం, పూర్వ విద్యార్థుల సంఘం, యారో అడ్వర్టయిజింగ్ సంస్థ సంయుక్తంగా సోమవారం సాయంత్రం ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆధ్వర్యంలో 'గోరటి పాట' సంగీత సంధ్య కార్యక్రమాన్ని యూనివర్సిటీలోని భవనం వెంకట్రాం ఆడిటోరియంలో నిర్వహించారు. యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు శ్రీనివాస్, కవులు, సాహిత్యవేత్తలు అపర్ణతోట, మొర్తాల విమల, తెలుగు సాహిత్యవేత్త యాకుబ్, యారో అడ్వర్టయిజింగ్ సంస్థ ఎండీ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుమలను గౌరవించింది కేసీఆరే

మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కురుమజాతిని గౌరవించింది కేసీఆర్ ప్రభుత్వమేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్‌లోని బీరప్పస్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. వారికి ఎమ్మెల్సీ పదవితో పాటు మల్లన్న దేవుడిని కులదైవంగా భావించే కురుమలకే కొమురవెల్లి మలన్న దేవాలయ చైర్మన్‌గా చేశామన్నారు. మల్లన్న కృపతో మల్లన్న సాగర్, కాళేశ్వరం నుంచి ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించి కరువు లేకుండా రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించిన ఘనత కేసీఆర్‌దేని అన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్ బెటాలియన్‌లో కమాండెంట్, సిబ్బంది..


చందానగర్‌లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి


మసీదుబండలో బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్, పలువురు నాయకులు

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధి కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు,బస్తీలలోని కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహాలకు, ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు, పలు చోట్ల అంబేడ్కర్‌కు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగ రూపకల్పనకు, ఆతర్వాత దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం చేసిన కృషిని కొనియాడారు. అంబేడ్కర్ అన్ని వర్గాలవారికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తారని గుర్తు చేశారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి మసీదుబండలోని అంబేడ్కర్ విగ్రహం వరకు డీఎస్‌యూ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో డప్పులతో ఊరేగింపుగా వచ్చి విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. –శేరిలింగంపల్లి జోన్ బృందం


హెచ్‌సీయూలో వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్


నానక్‌రాంగూడలో..స్థానికులు


నల్లగండ్లలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


రాయదుర్గంలో బాబూజగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్ వద్ద..


రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో నివాళులు అర్పిస్తున్న ఈడీ, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్‌టీఎల్‌రెడ్డి, ఫ్యాకల్టీ, విద్యార్థులు


హెచ్‌సీయూలో ఊరేగింపుగా వస్తున్న డీఎస్‌యూ విద్యార్థులు


ఎంఏనగర్‌లో ఎంసీపీఐయూ నాయకులు


చందానగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యలయం వద్ద..

అభివృద్ధి పనుల్లో జాప్యం.. ప్రజల పాలిట శాపం

మియాపూర్: అభివృద్ధి పనుల్లో జాప్యం ప్రజల పాలిట శాపంగా మారింది. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ రోడ్డులో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ రోడ్డులో డ్రైనేజీ రోడ్డు పై పొంగి పొర్లడంతో నూతన పైపులైన్ పనులు చేపట్టారు. నెల రోజుల క్రితం డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పనుల్లో జాప్యం కారణంగా ఇప్పటికీ పూర్తి కాలేదు. వారం రోజుల్లో పూర్తి చేయాల్సిన పనులను నెమ్మదిగా కొనసాగించడంతో ఆ రోడ్డు వెంబడి ప్రయాణాలు సాగించే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా గంటల తరబడి వాహనాలు రోడ్ల పైనే నిలబడాల్సి వస్తోంది. ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే వారందరూ సమయానికి చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఇష్టారాజ్యంగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో నత్తనడకన కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులు

అంబేడ్కర్ మార్గంతోనే సమ సమాజ స్థాపన


అంబేడ్కర్ యూనివర్సిటీలో వీసీ ఘంటా చక్రపాణి తదితరులు

సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ కత్తి పద్మారావు

బంజారాహిల్స్: సమ సమాజ స్థాపనకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చూపిన మార్గాన్ని అందరూ ఆచరించాల్సిందేనని ప్రఖ్యాత కవి, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ కత్తి పద్మారావు పేర్కొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'సామాజిక సాధికారత' ఉత్సవాల్లో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జ్ఞానవనంలోని అంబేడ్కర్ విగ్రహం, పరిపాలనా భవనం వద్ద ఘనంగా పుష్పాంజలితో నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారకోపన్యాసంలో కత్తి పద్మారావు ముఖ్యఅతిథిగా హాజరై 'అంబేడ్కర్ సమకాలీన దర్శనం' అంశంపై ఆన్‌లైన్ ద్వారా ఉపన్యాసం చేశారు. అంబేడ్కర్ కుల వ్యవస్థను చాలా దగ్గర నుంచి చూశారని, కుల వివక్షతకు గురయ్యారన్నారు. నేటికీ విద్య, ఉద్యోగాల్లో కులం పేరుతో వివక్షతను చూస్తున్నామన్నారు. అంబేడ్కర్ చెప్పిన కుల రహిత, కులాల రద్దు సిద్ధాంతం ఇంకా పూర్తి కాలేదన్నారు. సమానత్వం కోసం పోరాటం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యాప్తికి, పేదల అభ్యున్నతికి అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ చేస్తున్న కృషిని వివరించారు. యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయ కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, బోజు శ్రీనివాస్, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు సుధారాణి, ఆనంద్ పవర్, వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాబ్డే, రవీంద్ర నాథ్ సోలోమన్, వెంకటరమణ పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని ధర్నా

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో మూడు రోజుల నుంచి మంచినీటి సరఫరా రావటం లేదని కాలనీ వాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా కాలనీలో మంచినీటి ప్రధాన లైన్ పనులు జరుగుతున్నాయి. కాలనీలోకి వెళ్లే వాటర్ లైన్ మూడురోజుల క్రితం పగిలింది. మూడు రోజుల నుంచి మరమ్మతులు చేయకుండా కాలనీలకు నీరు వదలటం లేదు. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీలలోని కొన్ని వీధుల్లో తాగడానికి కూడా మంచినీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ ప్రజలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించటం లేదు. నీటి సరఫరాలో సమస్య ఉన్నప్పుడు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలని స్థానికులు ధర్నా నిర్వహించారు. ఆదివారం కూడా ధర్నా చేశామని, వాటర్‌వర్క్స్ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. పగిలిన పైపులైన్ మరమ్మతులు చేసి నీటిని అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అభిలాష్ యాదవ్, స్వామి, మంజునాథ్, విశ్వనాథ్, మహేష్, నరేష్, సుహాసిని, సంధ్య, రవి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రాజేంద్రనగర్: పార్కు స్థలాన్ని చదును చేసిన వ్యక్తిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పురా భవానీకాలనీలో గతంలో లకన్ సింగ్ అనే వ్యక్తి వెంచర్ చేసి 1000 గజాల పార్కు స్థలాన్ని వదిలారు. కాలనీ ప్రజలు ఈ పార్కు స్థలాన్ని అభివృద్ధి పరుచుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ స్థలం విలువలు పెరిగిపోవడంతో సోమవారం ఉదయం జేసీబీతో లకన్ సింగ్ పార్కు స్థలం వద్దకు వచ్చాడు. జేసీబీతో చదును చేస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు లకన్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని జేసీబీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

కూకట్‌పల్లి: అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉండే ఈ రోజుల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అన్ని దుకాణాల సముదాయాలు, ఇళ్లు, స్కూల్స్, హాస్పిటల్స్ వంటి ప్రాంతాల్లో తప్పకుండా ఫైర్‌సేఫ్టీని పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రజలందరూ కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ జగన్‌మోహన్, లచ్చిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో..

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ టి. జగన్‌మోహన్‌తో కలిసి వీసీ డా. టి. కిషన్ కుమార్ రెడ్డి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఫైర్ సేఫ్టీ అధికారి జగన్‌మోహన్ మాట్లాడారు.

రెండో రోజూ మృతి చెందిన చేపలు


గోపన్‌పల్లిచిన్నాపెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు


చెరువును పరిశీలిస్తున్న ముదిరాజ్‌సంఘం సభ్యులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్నపెద్ద చెరువులో సోమవారం (రెండోరోజూ) మరిన్ని చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు చెరువులో చేరడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముదిరాజ్‌సంఘం ప్రతినిధులు గోపన్‌పల్లిలోని చిన్నాపెద్ద చెరువును సందర్శించారు. తాము పడ్డ కష్టమంతా నీళ్ళపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

గోపన్‌పల్లిచెరువును పట్టించుకోరా?

గోపన్‌పల్లి చెరువును అధికారులు పట్టించుకోరా...? అని ముదిరాజ్ సంఘం గోపన్‌పల్లి అధ్యక్షుడు శంకరి రాజుముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గోపన్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ 25క్వింటాళ్ళ చేపలు మృగశిర కోసం పెంచామని, మొదటిసారి 10 క్వింటాళ్ళ చేపలు చనిపోయాయని, తాజాగా 15 క్వింటాళ్ళ చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలు పెంపకమే జీవనంగా సాగిస్తున్నామని, మాకు వేరే ఇతర ఆధారం లేదన్నారు. చాలా నష్టపోయామని ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే జరిగిందన్నారు. మొదటిసారి జరిగినప్పుడు స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే మరింత నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా మురుగునీరంతా చెరువులో చేరుతోందని, అయినా అధికారులు నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మురుగునీరు చెరువులో చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గోపన్‌పల్లి సభ్యులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

అక్రమంగా బస్ షెల్టర్ల తొలగింపు
- బస్ షెల్టర్లు లేక ఎండలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- చెట్ల నీడ, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నీడలే ఆసరా

చందానగర్: ఒక వైపు భానుడి భగ భగ.... మరోవైపు వేసవి ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సిటీ బస్సులో వెళ్లే ప్రయాణికులు బస్‌స్టాప్‌లో షెల్టరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు జాతీయ రహదారిపై వ్యాపార సముదాలు పెరుగుతుండగా బస్టాప్ షెల్టర్లను రాత్రికి రాత్రే అక్రమంగా తొలగిస్తున్నారు.

- హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలో ఆర్టీసీ బస్టాప్‌లలో ప్రయాణికులు నిలబడడానికి షెడ్డు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- చెట్టు కొమ్మలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల కింద, చిరు వ్యాపారుల దుకాణాల ముందు ఉన్న నీడలోనే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.
- హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తా మొదలుకొని ఓల్డ్ హఫీజ్‌పేట్, న్యూహఫీజ్‌పేట్, సీఆర్ ఫౌండేషన్, మదీనాగూడ, దీప్తిశ్రీనగర్, గంగారం, చందానగర్ బస్టాప్‌ల వద్ద బస్ షెడ్డు లేక ప్రయాణికులు చెట్ల కొమ్మల కింద నిలబడి ఎదురుచూస్తున్నారు.
- ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు బస్టాప్‌లలో షెడ్లను నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


చందానగర్ గంగారం బస్టాప్ షెల్టర్‌ను రాత్రికి రాత్రే తొలగించిన దృశ్యం


మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌లో ..


చందానగర్ ఆర్ఎస్ బ్రదర్స్ ముందు..


న్యూ హఫీజ్‌పేట్ ఆదిత్యనగర్‌లో..

బస్టాప్‌లలో షెల్టర్లను ఏర్పాటు చేయాలి



ఓల్డ్ హఫీజ్‌పేట్ ఇరువైపుల ఆర్టీసీ బస్టాప్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి. చెట్ల కొమ్మల కింద బస్సు కోసం ఎదురు చూస్తున్నాం. ఆర్టీసీ బస్సుల బస్టాప్‌లలో ఆపకుండా రోడ్డుపైనే ఆపడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందో భయపడున్నాం. ఇప్పటికైనా అధికారులు వెంటనే బస్టాప్ షెడ్డును ఏర్పాటు చేయాలి. – అరవింద్, ప్రయాణికుడు

ఇబ్బందులు పడుతున్నాం



ఒకవైపు వేసవి కాలం, మరో వైపు అక్రమంగా బస్టాపుల తొలగింపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అక్రమంగా కొంత మంది వ్యాపార సముదాల ముందు ఉన్న బస్టాప్‌లను రాత్రికి రాత్రే తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.
– రవికుమార్, ప్రయాణికుడు

ఫోన్ చేసుకుని ఇస్తామని మొబైల్‌తో జంప్

బంజారాహిల్స్: దారిన వెళ్లే ఓ వ్యక్తిని ఆపి ఫోన్ చేసుకుని ఇస్తామని మొబైల్ తీసుకుని ఇద్దరు వ్యక్తులు ఉడాయించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే...జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌కు చెందిన నరేష్ రసైలి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-9లోని నెట్‌వర్కింగ్ బిల్డింగ్‌లో గత నాలుగు సంవత్సరాలుగా వాచ్‌మెన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 12న రాత్రి 9 గంటల సమయంలో డ్యూటీకి వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు 13వ తేదీన తెల్లవారుజామున 5.20 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటిబాట పట్టాడు. వెంకటగిరి నుంచి వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై అతని వద్దకు వచ్చి తమ మొబైల్ ఫోన్ రీఛార్జ్ గడువు ముగిసిందని, ఒక్కసారి నీ ఫోన్ ఇస్తే చేసుకుని ఇస్తామని నమ్మబలికారు. దీంతో నరేష్ తన ఫోన్‌ను వారికి ఇచ్చాడు. ఫోన్ తీసుకున్న ఆగంతకులు ఫోన్ చేసినట్లుగా నటించి బైక్‌పై ఉడాయించారు. ఈ సమయంలోనే బైక్‌పై వెనుక కూర్చొన్న ఆగంతకుడు నరేష్ జుట్టు పట్టుకొని 5 మీటర్ల మేర లాక్కెళ్లాడు. ఈ ఘటనలో కిందపడిపోయిన నరేష్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.